## షిరిడిసాయి బాబాను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

**- గురుపూర్ణిమ సందర్భంగా ప్రత్యేక పూజల నిర్వహణ**



షిరిడిసాయి బాబాను దర్శించుకొంటున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

**ఉరవకొండ, జూలై 3 ప్రభాతవార్త :** కూడేరు మండల కేంద్రంలోని షిరిడిసాయిబాబా ఆలయాన్ని సోమవారం ఉదయం ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి సందర్శించారు. గురుపూర్ణిమ సందర్భంగా ఆయన షిరిడిసాయి బాబా స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేయించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను శాలువాకప్పి సన్మానించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేసింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నారాయణరెడ్డి, నాయకులు బైరెడ్డి రామచంద్రారెడ్డి, మంజునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పూర్ణానందస్వామి ఆలయంలో ఘనంగా గురుపూర్ణిమ వేడుకలు

**- కొనసాగిన అభిషేకాలు, మహామంగళ హారతి కార్యక్రమాలు**

**ఉరవకొండ, జూలై 3 ప్రభాతవార్త :** పట్టణంలోని కణేకల్లు రోడ్డులోగల పూర్ణానందస్వామి ఆలయంలో శ్రీ శోభకృత్‌నామ సంవత్సరం ఆషాడ గురు పూర్ణిమ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఉదయం స్వామివారి విగ్రహానికి పంచామృతాభిషేకం, శ్రీసూక్త పూజలు, మహా మంగళహారతి కార్యక్రమాలు కొనసాగగా పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున స్వామివారిని దర్శించుకోగా వారికి ఆలయ కమిటీ తీర్థ ప్రసాదాలు అందించింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మెన్ గవ్వల సోమశేఖర్, సభ్యులు రమేష్, నాగభూషన్, బసవరాజు, ఓబన్న తదితరులు పాల్గొన్నారు.



పూర్ణానందస్వామివారికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

## ఘనంగా వ్యాస పౌర్ణమి వేడుకలు

**- వ్యాస మహర్షి చిత్రపటానికి పూజలు చేసిన బెస్త సేవా సంఘం**



క్లాక్‌టవర్ కూడలిలో వ్యాస మహర్షి చిత్రపటానికి పూజలు నిర్వహిస్తున్న బెస్తలు

**ఉరవకొండ, జూలై 3 ప్రభాతవార్త :** పట్టణంలో సోమవారం వ్యాస పౌర్ణమి వేడుకలు ఘనంగా భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఉరవకొండ బెస్త సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక క్లాక్‌టవర్ కూడలిలో వ్యాస మహర్షి చిత్రపటాన్ని ఉంచి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు తిప్పయ్య మాట్లాడుతూ వ్యాస పౌర్ణమి లేక గురు పౌర్ణమిను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా జరుపాలని డిమాండ్ చేశారు. చరిత్ర తెలియని ఆధునిక సామాజం వ్యాస పౌర్ణమిని కొద్ది మందికి అంకితం చేసే విధంగా జరుపుకోవడం దురదృష్టకర మని ఇది క్షమించరాని నేరమని ఇది వ్యాస మహర్షిని అవమానించడం, తక్కువచేసి చూపడమే అవుతుందన్నారు. వేదవ్యాసుడు ఒక బలహీనవర్గానికి చెందిన గంగపుత్రుడు కావడమేనా అని ప్రశ్నించారు. వేల సంవత్సరాల క్రితం బట్టలు కట్టుకోవడం చేతగాని అనాగరిక ప్రపంచంలోనే అద్భుతమైన టువంటి విజ్ఞానాన్ని సముపార్జించి భారత, భాగవతాలను రచించి వేదాల ద్వారా ప్రపంచానికి నాగరికతను చాటినటువంటి వేద వ్యాసుడిని అవమానించడం అంటే మనల్ని మనం అవమానించుకోవడం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ కార్యదర్శులు ఎర్రిస్వామి, రామాంజినేయులు, నాయకులు వెంకటేష్, నాగన్న, రామన్న, హరి, రవి., సర్వేష్, రామాంజి, ఎర్రిబాబు, అనీల్, మురళి, భీమలింగ, సుజాత, అశ్విని, కుళ్లాయమ్మ, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు పాఠశాలల్లో డొనేషన్లు, అధిక ఫీజుల వసూళ్లను అరికట్టండి

**- స్పందన గది ముందు జీవీఎస్ఎస్, ఎస్సీ, ఎస్టీ ఐక్య వేదిక ధర్నా**

**ఉరవకొండ, జూలై 3 ప్రభాతవార్త :** పట్టణంలోని ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా డొనేషన్లు, అధిక ఫీజులు వసూళు చేస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గిరిజన విద్యార్థి సంక్షేమ సంఘం (జీవీఎస్ఎస్), ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక సోమవారం పట్టణంలోని మండల తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన స్పందన గది ముందు బైటాయించి ధర్నా నిర్వహించాయి. ఈ సందర్భంగా జీవీఎస్ఎస్ రాష్ట్ర కార్యదర్శి సాకే పురుషోత్తం, ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లబోతుల రాజశేఖర్ తదితరులు మాట్లాడుతూ పట్టణంలోని కొన్ని ప్రైవేటు పాఠశాలలు ఈ-టెక్నో, ఒలంపియాడ్, ఐఐటీ పేరుతో ఇష్టారాజ్యంగా ఫీజులు వసూళు చేస్తున్నాయని వాపోయారు. పాఠ్యపుస్తకాలు మొదలు, స్టేషనరీ సామాన్లు వరకు అన్ని పాఠశాలలోనే అమ్ముతూ విద్యను వ్యాపారం చేసేశాయన్నారు. ఒక పాఠశాల మరొక పాఠశాల గుర్తింపుతో నిర్భయంగా నడుపుతున్నా మండల విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. విద్యాహక్కు చట్టం మచ్చుకకు కూడా అమలు కావడంలేదని నిబంధనల పేరుకు పేద, సామాన్య, మధ్యతరగతి వర్గాలకు చెందిన చెందిన విద్యార్థులకు ఉచిత విద్య అందించడంలేదని వాపోయారు. ధర్నా అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మండల విద్యాధికారి ఈశ్వరప్పకు అందజేయగా వారం రోజుల్లో సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్షుడు బండారు ఫ ృధ్విరాజ్, ఎంవీఎంఎస్ మండల అధ్యక్షుడు ధనుంజయ, ఎస్సీ ఎస్టీ ఐద్య వేదిక సాయకులు సాకే ఉదయ్, ఎంఎస్ఎఫ్ సిసింద్రి, హనుమంతు, ఎంఆర్‌పీఎస్ నాయకులు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వేదవ్యాస మహర్షి జయంతి

**పుట్టపర్తిటౌన్, జులై 03, ప్రభాతవార్త**

పట్టణంలోని బెస్త సేవా సంఘం ఆధ్వర్యంలో వేదవ్యాస మహర్షి జయంతి వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు జ్యోతి చంద్రశేఖర్ మాట్లాడుతూ,మానవాళికి దిశదశ నిర్దేశం చేసిన గురువులను స్మరించుకునిపూజించుకునే సాంప్రదాయంకొనసాగడం గురుపూర్ణిమ యొక్క విశిష్టత అని తెలిపారు. త్వరలో నిర్మించనున్న గంగపుత్ర కళ్యాణ మడపం స్థలాన్ని సందర్శించి తన వంతుగా లక్ష రూపాయల విరాళాన్ని జ్యోతి చంద్రశేఖర్ ప్రకటించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సుధానాగార్జున, కోశాధికారి కృష్ణమూర్తి, గౌరవ సలహాదారులు బెస్తచలపతి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జ్యోతి ప్రసాద్, నాయకులు రామాంజినేయులు, జైసాయి, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.



వేదవ్యాస మహర్షి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

## గుడి, బడి, స్మశానాలకు స్థలాలు కేటాయించండి



తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న హెచ్ఆర్‌సిపిఐ నాయకులు

**కొత్తచెరువు, జులై 03, ప్రభాతవార్త** నూతనంగా ఏర్పాటు చేసిన జగనన్న హౌసింగ్ కాలనీల యందు ప్రజల సౌకర్యార్థం గుడి, బడి, అంగ్‌వాడీ సెంటర్లు, మసీదులు, చర్చిలకు స్థలాలు కేటాయించాలని హెచ్ఆర్‌సిపిఐ నాయకులు వడ్డెపాపన్న తహశీల్దార్ రామాంజనేయ రెడ్డిని కోరారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. గతంలో కూడా పలు మార్లు ఈ మేరకు వినతిపత్రాలు అందించడం జరిగిందని, అయినా చర్యలు తీసుకోలేదని కోరారు. అలాగే స్మశాన వాటిక లేక ఎంతో మంది చెరువులోనే అంత్యక్రియలు నిర్వహిస్తున్నారని, ప్రస్తుతం నీటితో నిండి ఉండడంతో అంత్యక్రియలుచేసుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కావున హిందూ స్మశాన వాటిక కొరకు ప్రత్యేకంగా స్థలాన్ని కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంటనే నాగరాజు, పాపమ్మ, సాయి ప్రసాద్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్‌లో అల్పసంఖ్యాకుల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని సీపీఎం డిమాండ్



జిల్లాధికారి కార్యాలయంలో అధికారికి వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

**బళ్లారి, జూలై03, ప్రభాతవార్త ;** ఈనెల 7వ తేదీన ముఖ్య మంత్రి సిద్ధరామయ్య ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌లో అల్పసంఖ్యాకుల అభివృద్ధికి, సామాజిక న్యాయం, రాజ్యాంగం సిద్ధాంతా ల మేరకు ప్రత్యేక నిధులు కేటాయిం చాలని కోరుతూ జిల్లా సీపీఎంకు చెందిన పదాధికారులు జిల్లాధికారి కార్యాలయం వద్ద ప్రదర్శన చేపట్టారు. దేశ రాజకీయాలను తారతమ్యత రాజకీయాన్ని ఓటమిపాలు చేసిన ప్రజలు, విశ్వాసంతో కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టిన సందర్భంలో సీపీఎం, సీపీఐఎం పార్టీలతో పాటు ఇన్సాఫ్ సంఘం రాజ్యాంగంలో పేర్కొన్నవిధంగా ఎటువంటి తారతమ్యత లేకుండా సమానంగా అన్ని కులమతాలు, వర్గాలకు చెందిన ప్రజలకు అభివృద్ధి విషయంలో సమానత పాటించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో బీజేపీ ప్రభుత్వం ముస్లీం సోదరులపై ద్వేషపూరిత రాజకీయం చేసిందని, అనేక అభివృద్ధి విషయాల్లో తారతమ్యత చేసిందని, దీంతో అల్పసంఖ్యాకుల్లో భయభ్రాంతులు నెలకొని, హతాశులుగా ఉండిపోయారని తెలిపారు. జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పారని, అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల అల్పసంఖ్యాకులు నెమ్మదిగా జీవనం సాగిస్తున్నారని, వారికి రాష్ట్ర బడ్జెట్‌లో తగినన్ని నిధులు విడుదల చేయాల్సిన ఆవశ్యకత ఉన్నదన్నారు. రాష్ట్ర జనాభాలో 14 శాతం ముస్లీం సోదరులు ఉన్నారని, కర్ణాటకలోని ముస్లీం సోదరుల ఆర్థిక, సామాజిక, ఉద్యోగ, శైక్షణిక స్థితిగతులు శోచనీయంగా ఉన్నాయని, భారత ప్రభుత్వం ఈ అంశాలపై గతంలో అల్పసంఖ్యాకుల స్థితిగతులను అధ్యయనం చేసేందుకు రూపొందించిన డాక్టర్ రాజేంద్రసింగ్‌శాచర్, న్యాయమూర్తి రంగనాథ్‌మిశ్రల సమితిల సిఫారసుల మేరకు న్యాయం కల్పించాలని చెప్పారు. కావునా రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య బడ్జెట్‌లో అల్పసంఖ్యాకులకు అన్నివర్గాలకు సమానంగా దృష్టి పెట్టి తగినన్ని నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సీఎంకు రాసిన వినతి పత్రాన్ని జిల్లాధికారి కార్యాలయం అధికారికి సీపీఎం నాయకులు జె.సత్యబాబు, జె.చంద్రకుమారి, ఇన్సాఫ్ సంస్థకు చెందిన ఖాజామునీద్దీన్, అబ్దుల్‌లతీఫ్, సయ్యద్‌అంజాద్, హుసేన్, ఎం.డి.జహీర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తి, అంతస్తులు సమాజానికి సమర్పణ అని బతకాలి

**- పారిశ్రామికవేత్త, కాపుక్షేత్రం ఎమ్మెల్యే సురేష్‌శెట్టికి**



కాపు నియోజకవర్గం ఎమ్మెల్యే సురేష్‌శెట్టిని సత్కరిస్తున్న తుంగభద్ర బంటరసంఘం

### బళ్లారిలో ఆత్మీయ సత్కారం

**బళ్లారి, జూలై03, ప్రభాతవార్త ;** మనిషి తాను సంపాదించిన ఆస్తులు, అంతస్తులు సమాజానికి సమర్పణ చేయాలనే తలంపుతోనే బతకాలని, అన్ని జాతుల, సముదాయాల మతాలకు చెందిన ప్రజలతో కలివిడిగా తిరగాలని ఉడిపి జిల్లా కాపు క్షేత్రం బీజేపీ ఎమ్మెల్యే గుర్మే సురేష్‌పి.శెట్టి తెలిపారు. నగరంలోని బంట్స్ భవనంలో తుంగభద్ర బంట్స్ సంఘం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో గౌరవ సత్కారం స్వీకరించి మాట్లాడారు. తమ బంట్స్ సమాజానికి చెందిన ప్రజలు సాధారణంగా బొంబాయి, చెన్నైలకు వ్యాపారాలు చేసుకునేందుకు వెళ్తారు. అయితే తాను బళ్లారికి వచ్చి, వీరశైవ డిగ్రీ కళాశాలలో విద్యాభ్యాసం చేసినట్లు పేర్కొన్నారు. తన మాతృమూర్తి పదేపదే చెబుతుండేవారు ఎంతకష్టం వచ్చినా నీలో నిజాయితీ చంపుకోవద్దు, ప్రామాణికతతో , క్రమశిక్షణతో సమాజంలో మెలగాలని చెప్పేవారని తెలిపారు. ఈ అన్నింటినీ తాను బళ్లారిలో ఉండి పాటించినందుకే తాను నేడు ఈ ఉన్నతస్థానంలో ఉన్నట్లు తెలిపారు. బళ్లారిలో చిన్నగా హోటల్‌ను ప్రారంభించి క్రమేణా వ్యాపార రంగంలోకి అడుగుపెట్టి మైన్స్ ట్రేడింగ్‌లో తాను అభివృద్ధి చెందినట్లు, అలాగే బళ్లారిలో హోటళ్ల సంఘం అధ్యక్షుడిగానూ ఉన్నట్లు, అనేక సందర్భాల్లో తాను అన్ని రాజకీయ పార్టీల నాయకులతో కలిసిమెలిసి తిరిగేవాడినని, ఎవరితోనూ ఇప్పటివరకు విభేధాలు రాలేదని, అందరితోనూ సౌమ్యుడిగా మెలిగినట్లు తెలిపిన ఆయన, సామాజికసేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ బళ్లారిలో హోటళ్ల అభివృద్ధికి, ఇతర సేవా రంగాల్లో తాను పాల్గొన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సురేష్‌శెట్టి తనకొక సోదరుడిగా కంటే ఎక్కువగా ఉన్నాడని, సురేష్ అందరితో స్నేహభావం కలిగి ఉండే స్నేహజీవి అని, మంచి కళాకారుడు కూడా సురేష్‌శెట్టి ఉన్నాడని, అతనిలో ఒక గాయకుడు ఉన్నాడని సభలో తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి మాట్లాడుతూ సురేష్‌శెట్టి తన తండ్రి సమానుడని, మంచి దానకర్ణుడు అని, సెక్యులర్ నాయకుడిగా ఉన్నాడని, కాపు క్షేత్రం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది బళ్లారికి వచ్చినందుకు తనకెంతో సంతోషంగా ఉన్నదన్నారు. ఇదే సందర్భంలో బైందూరు ఎమ్మెల్యే గురురాజ్ మాట్లాడుతూ సురేష్‌శెట్టికి బళ్లారి ఒక కర్మభూమిగా ఉన్నదని, బళ్లారిలో ఉండి సొంత జిల్లాకు వచ్చి స్థిరపడినా ఆయన ఇక్కడి సామ్రాజ్యం చూసి తాను విస్తుపోయినట్లు సభలో హర్షధ్వానాల మధ్య చెప్పారు. సభకు తుంగభద్ర బంట్స్ సంఘం అధ్యక్షుడు డా.మాధవశెట్టి అధ్యక్షత వహించారు. హోటళ్ల యజమానుల సంఘం అధ్యక్షుడు మధుసూదన్, చేంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, డా.డి.ఎల్.రమేష్‌గోపాల్, ఉప మేయర్ జానకి, సూర్యకుమార్‌శెట్టి, శాంతారామ్‌శెట్టి, శ్రీనివాసరెడ్డి తదితరులు ప్రసంగించారు.

## ప్రభుత్వ స్థలం కబ్జాకు గురిగాకుండా నగరపాలికె కైవశం చేసుకోవాలి

**- బళ్లారి ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి పరిశీలన**



17వ వార్డులో ఖాళీగా ఉన్న 60 ఎకరాల భూమిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

**బళ్లారి, జూలై03, ప్రభాతవార్త ;** నగరంలోని 17వ వార్డులో ప్రభుత్వ స్థలంగా ఉండి భూకబ్జాదారులు కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నం చేస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి నగరపాలికె సిబ్బంది, అధికారులతో వెళ్లి సదరు స్థలాన్ని పరిశీలన జరిపారు. సుమారు 60 ఎకరాల విస్తీర్ణం కలిగిన ప్రభుత్వ భూమిని బళ్లారి మహానగరపాలికెకు స్వాధీనం చేసుకుని రక్షణ కల్పించాలన్నారు. స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేసి స్థలాన్ని స్వచ్ఛత చేయాలని అధికారులకు సూచించారు. సదరు స్థలాన్ని కొందరు ప్రముఖ వ్యక్తులు కబ్జా చేసేందుకు చూస్తున్నారని, ప్రయివేట్ వ్యక్తులకు లీజు కింద ఇచ్చి తద్వారా అద్దె పొందేందుకు ప్రయత్నిస్తున్న సమాచారం తెలిసిన ఎమ్మెల్యే తక్షణమే స్థలం వద్దకు చేరుకుని అధికారులకు కట్టుదిట్టమైన ఆదేశాలు జారీ చేశారు. సదరు స్థలాన్ని జేసీబీలతో స్వచ్ఛపరిచి ఫెన్సింగ్ వేసి మొక్కలను నాటాలన్నారు. సామాజిక అటవీశాఖచే చెట్లు పెంచాలని సూచించారు. ప్రభుత్వ స్థలాలు కానీ, నగరపాలికెకు చెందిన స్థలాలు కానీ ఎక్కడైనా కబ్జాదారుల వశంలో ఉంటే తక్షణమే వాటిని గుర్తించి స్వాధీనం చేసుకోవాలని పాలికె అధికారులకు ఎమ్మెల్యే నారాభరత్‌రెడ్డి ఆదేశించారు.

## బళ్లారిలో భక్తిశ్రద్ధలతో గురుపూర్ణిమ ఆచరణ

**- భక్తుల సందడితో కిటకిటలాడిన సాయిబాబా మందిరాలు**



బళ్లారిలోని శ్రీ షిర్డీ సాయిబాబా దేవస్థానం వద్ద భక్తుల సందడి దృశ్యం

**బళ్లారి, జూలై 03, ప్రభాతవార్త ;** గురుపూర్ణిమ సందర్భంగా నగరంలోని శ్రీ సాయిబాబా దేవాలయాలు భక్తజనం సందడితో కిటకిటలాడాయి. ఉదయం నుంచే సాయిబాబా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకం, ప్రసాదం వితరణ తదితర విశేష కార్యక్రమాలు జరిగాయి. నగరంలోని తిలక్‌నగర్ సాయిబాబా మందిరంలో ఉదయం 5 గంటల నుంచే భక్తులు రావడం కనిపించింది. బాబాకు భక్తిశ్రద్ధలతో దర్శనం చేసుకొని ప్రసాదం స్వీకరించగా, విశాల్ నగర్‌లోని శ్రీ షిర్డీ సాయిబాబా దేవస్థానంలో ట్రస్టు నిర్వాహకులు బాబా విగ్రహానికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా క్యూ పద్ధతిలో బాబా సందర్శనకు ఏర్పాట్లు చేశారు. పటేల్‌నగర్, కోట ప్రాంతంలోని సాయిబాబా దేవస్థానాల్లోనూ పూజలు జరిగాయి. ఇదే సందర్భంలో ప్రజలు, మహిళలు అధిక సంఖ్యలో హాజరై బాబా దర్శనం పొందారు. తమ ఇష్టదైవం బాబా పేరిట పలువురు సంఘ సంస్థలకు చెందిన వ్యక్తులు, పారిశ్రామికవేత్తలు ప్రత్యేక తీపి వంటలతో భక్తులకు భోజనాలు వడ్డించారు.

## గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసిన ఎండిఓ



గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎండిఓ

**బెలుగుప్ప, జులై 3 ప్రభాతవార్త :** మండల పరిధిలోని సీర్ధి గ్రామంలో మండల అభివృద్ధి అధికారి రామచంద్ర గ్రామ సచివాలయాన్ని తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో భాగంగా సచివాలయంలో పని చేస్తున్న ఉద్యోగస్తులు సరైన వేళలకు రావాలని వచ్చిన గ్రామస్తులందరికీ వారి వివరాలు తెలుసుకుని వారికి ధృవీకరణ పత్రాలు అందజేయాలని తెలిపారు. రికార్డులు సైతం తనిఖీ నిర్వహించారు. పంచాయితీ సెక్రెటరీ రవికుమార్, పాండు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**బెలుగుప్ప, జులై 3 ప్రభాతవార్త :** మండలకేంద్రంలో సోమవారం రోజు ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం షిర్డిసాయి బాబాకు సుప్రభాత సేవలు, మహాగణపతి హోమం, షిర్డిసాయిబాబా పంచామృతాభిషేకం, వచ్చిన భక్తాదులకు తీర్థప్రసాదాలు అందించారు. సాయంత్రం షిర్డిసాయిబాబా చిత్రపటాన్ని పుర వీధుల గుండా గ్రామస్తులు భజన పాటలతో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. రాత్రి 8 గంటలకు భజన పోటీలుకూడా నిర్వహిస్తామని తెలిపారు. అందులో భాగంగా నక్కలపల్లి గ్రామంలో కూడా షిర్డిసాయి బాబా వేడుకలు ఘనంగా నిర్వహించి భజన పోటీలు కూడా నిర్వహించారు. గెలిచిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో శివనాయక్, ఆలయ దర్మకర్త ఉమ్లానాయక్, శివనాయక్, ఆలయ కమిటీ సభ్యులు, భువనేశ్వర్‌బాయి, వరలక్ష్మి, చంద్రనాయక్, రామునాయక్, రాంబాబు, త్రివేది నాయుడు, రామకృష్ణరెడ్డి, మల్లప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్‌ను విస్మరించటం శోచనీయం

**- నిరసన వ్యక్తం చేసిన ఎన్టీఆర్ వీరాభిమాని హమాలి గోపాల్**



గజమాలతో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న హమాలి గోపాల్.

**పామిడి, జులై 03 ప్రభాతవార్త :** టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు భవిష్యత్తుకు గ్యారెంటీ పేరుతో బస్సుయాత్ర చేపట్టిన జిల్లా, నియోజకవర్గ నేతలు అటు ఎన్టీఆర్, పట్టణ ప్రజలను విస్మరించటం శోచనీయం అని ఎన్టీఆర్ వీరాభిమాని, గ్రామపంచాయతీ మాజీ వార్డు సభ్యులు హమాలి గోపాల్ మండిపడ్డారు. టిడిపి నేతలు అనుసరించిన నిర్లక్ష్యవైఖరికి నిరసనగా హమాలి గోపాల్ సోమవారం ఎన్టీఆర్, అంబేద్కర్ విగ్రహాలకు గజమాలలతో నివాళులు అర్పిస్తూ ఆయాప్రాంతాల్లో బాణాసంచాను పేల్చారు. వైసీపీ ప్రభుత్వం అవలంభిస్తున్న నిర్లక్ష్య విధానాలను ఎండగడుతూ టిడిపి ప్రభుత్వ హాయంలో అమలు చేసిన పథకాలు జరిగిన అభివృద్ధిని బస్సుయాత్ర ద్వార ప్రజలకు వివరించాలని చంద్రబాబునాయుడు దిశానిర్దేశం చేసినప్పటికీ ఆయన ఆదేశాలను పాటించకుండా బస్సుయాత్రను ప్రజల మధ్యలో కాకుండా జాతీయరహదారి గుండా తీసుకెళ్తూ సెల్ఫీలంతో కాళయాపన చేస్తుండటం పట్ల అధినేత లక్ష్యాన్ని తుంగలో తొక్కినట్లైందన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ పేరుతో బస్సుయాత్రను చేపట్టిన టిడిపి జిల్లా, నియోజకవర్గ టిడిపి నేతలకు పామిడిలో ప్రజలు ఎన్టీఆర్ ఎందుకు గుర్తుకు రాలేదని కనీసం బస్సుయాత్రను పట్టణం లో కాకుండా జాతీయరహదారి గుండా వెళ్ళటం ఎంతవరకూ సమంజమని మరి వీరు ఎవరి భవిష్యత్తుకు గ్యారెంటీ ఇస్తారని ఎద్దేవ చేశారు. ఇప్పటికే సురక్ష పేరుతో వైసీపీ జనం మధ్యలో ఉండగా బస్సుయాత్రల పేరుతో టిడిపి జనం మధ్యలో కాకుండా జాతీయరహదారిపై వెళ్ళటం రాబోవు ఎన్నికల్లో టిడిపి గెలుపుకు ప్రజలెలా సహకరిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా టిడిపి అధిష్టానవర్గం స్పందించి ప్రజాసమస్యలపై ప్రజల మధ్యలో కార్యక్రమాలను రూపొందించేలా చర్యలు చేపట్టి రాబోవు ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కార్యకర్తలకు దిశానిర్దేశం చేయాల్సిన అవసరం ఎంతైనావుందని హమాలి గోపాల్ కోరారు.

## బీద రవిచంద్రను పరామర్శించిన బండారు శ్రావణిశ్రీ



బీద రవిచందర్‌తో మాట్లాడుతున్న బండారు శ్రావణిశ్రీ

**శింగనమల, జులై 3 ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిచంద్ర యాదవ్‌ను నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రావణిశ్రీ పరామర్శించారు. సోమవారం కాలుకి దెబ్బతగిలి నెల్లూరులోని ఆయన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న బీద రవిచంద్రను ఇంటికి వెళ్లి బండారు శ్రావణిశ్రీ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మరికొన్ని రోజులు ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు.

## అంగరంగ వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో షిర్డిసాయిబాబా

**శింగనమల, జులై 3 ప్రభాతవార్త :** గురుపౌర్ణమి సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీరంగనాయుని చెరువు కట్టపై వెలిసిన షిర్డిసాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గురుపౌర్ణమి వేడుకలకు మండల వ్యాప్తంగా బాబా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక అతిథిగా సింగిల్ విండో అధ్యక్షులు బొమ్మనశ్రీరామిరెడ్డి పాల్గొని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తులకు అన్నదానం కార్యక్రమంలో ఆయన స్వయంగా వచ్చిన భక్తులకు వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వహకులు, మండల పరిధిలోని బాబాభక్తులు, వైసీపీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మైనార్టీలకు చేస్తున్న మేలును చెబుతుంటే మీకెందుకు అంత ఉలుకు

**- టీడీపీ నేతల తీరుపై సైఫుల్లా బేగ్ ధ్వజం**

**అనంతపురం సిటీ, జులై 3 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో మైనార్టీలకు చేస్తున్న మేలును చెబుతుంటే టీడీపీ నేతలకు ఎంతుకు అంత ఉలిక్కిపాటు అని వైసీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు సైఫుల్లా బేగ్ ప్రశ్నించారు. నగరంలోని 6వ డివిజన్‌లోని మసీదులో నిర్వహించిన హర్‌దిల్‌మే వైఎస్ఆర్ హమ్ సబ్ జగన్‌కె సాత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నగర మేయర్ మహ్మద్ వసీం, మార్కెట్‌యార్డు ఛైర్మన్ జిల్లా వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అధ్యక్షులు రిజ్వాన్, కార్పొరేటర్ రహంతుల్లాతోకలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగేళ్ల వైసీపీ పాలనలో ముస్లింలకు రాజకీయంగా, ఆర్థికంగా సామాజికంగా, కల్పిస్తున్న గుర్తింపును ముస్లిం మత పెద్దలకు వివరిస్తున్నామన్నారు. ఇదే సందర్భంలో మసీదులలో సమస్యలు, ఇంకా మైనార్టీలకు ఏమైనా మేలు చేయాలా అన్న అంశాలను మత పెద్దల నుంచి అడిగి తెలుసుకుంటున్నామన్నారు. టీడీపీ నేతలు మసీదులలో వైసీపీ నేతలు రాజకీయం చేస్తున్నారని, విమర్శలు చేయడం సమంజసం కాదన్నారు. 14 ఏళ్లు సీఎంగా పని చేసిన చంద్రబాబునాయుడు ముస్లిం మైనార్టీలకు చేయలేనిపనులను నాలుగేళ్ల పాలనలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపించారన్నారు. అదే విధంగా అనంతపురం అర్బన్‌లో సైతం ఎన్నడూ లేని విధంగా మేయర్, మార్కెట్‌యార్డు ఛైర్మన్, 9 కార్పొరేట్ స్థానాలు, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ వంటి ఎన్నో పదవులను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ముస్లింలకు కేటాయించారన్నారు. ఈ అంశాలన్ని మైనార్టీల్లోకి వెళితే.. తమకు భవిష్యత్తు ఉండదనే టీడీపీ మైనార్టీ నేతలు విమర్శలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా టీడీపీ నేతలు వాస్తవాలు చెప్పాలని, అవాస్తవాలు చెబితే ఉపేక్షించబోమని హెచ్చరించారు.

## కియా ఇండియా మరో ఆవిష్కరణ

**- నేడు కొత్త సెల్టోస్ ఆరంభం**

**అనంతపురం కల్చరల్, జులై 3 ప్రభాతవార్త :** కియా పరిశ్రమ మరో ఆవిష్కరణతో ముందుకు వస్తోంది. జులై 4న కొత్త సెల్టోస్ కియా ఇండియా భారతదేశపు ప్రీమియం అది వేగంగా అభివృద్ధి చెందుతున్న కారు తయారీదారు ప్రకటించింది. కొత్త అవకాశంలోని సెల్టోస్, తాజా డిజైన్, శ్రేణిలో మెరుగైన ఫీచర్స్‌ను కలిగి ఉంది. తమ శ్రేణిలోని ప్రముఖ ఫీచర్స్, డిజైన్ నాయకత్వంలో ఆటో మొబైల్ పరిశ్రమలోనే సెల్టోస్ బ్రాండ్ కొత్త విప్లవాన్ని ఆరంభించింది. కొత్త సెల్టోస్ శ్రేణిని మరోసారి పున:కనుగొనడానికి సిద్ధంగా ఉంది. కియా 30 జూన్ 2023 కొత్త సెల్టోస్ టీజర్‌ను కూడా విడుదల చేసింది. అసంఖ్యాకమైన ప్రథమాలతో బ్రాండ్ సెల్టోస్ కియా భారతదేశంలోని ప్రముఖ 5 కారు తయారీ దారులలో ఒకటిగా తన స్థానాన్ని స్థిరపరుచుకోవడానికి సహాయపడింది. భారతదేశంలో ఆరు ఎయిర్ బ్యాగ్స్‌ను పరిచయం చేసిన కారుగా 2021లో సెల్టోస్ తమ శ్రేణిలోనే మొదటి కారుగా మారింది.

## మా నిధులు మాకు ఇవ్వమంటే అరెస్టులు చేస్తారా

**-రాష్ట్ర పంచాయితీరాజ్ ఛాంబర్ సభ్యులు డేగల కృష్ణమూర్తి**



డేగల కృష్ణమూర్తి

**శింగనమల, జులై 3 ప్రభాతవార్త :** మా నిధులు మాకు కావాలని కోరుతూ విజయవాడలోని తాడేపల్లి గూడెంలో పంచాయితీరాజ్ కార్యాలయానికి బయల్దేరిన రాష్ట్రంలోని సర్పంచులను అరెస్టు చేయడం దారుణమని రాష్ట్ర పంచాయితీరాజ్ ఛాంబర్ సభ్యులు డేగల కృష్ణమూర్తి పేర్కొన్నారు. సోమవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేస్తూ 2019-22 ఆర్థిక సంవత్సరానికి 14, 15వ ఆర్థిక సంఘం ద్వారా 12,918 గ్రామ పంచాయితీలకు విడుదల చేసిన 8,660 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించి తన సొంత పథకాలకు వాడుకుందని విమర్శించారు. మరోసారి 2023 ఆర్థిక సంవత్సరానికి 2010 కోట్లు 2023-24 ఆర్థిక సంవత్సరానికి 12690 కోట్ల రూపాయలు సర్పంచుల ఖాతాల్లో జమా చేయాలని సర్పంచులకు, ఎంపిటిసిలకు గౌరవ వేతనం రూ.15వేలు ఇవ్వాలని, ఆయన డిమాండ్ చేశారు. సర్పంచులను రాజకీయాలకు అతీతంగా పంచాయితీ రాజ్ కార్యాలయం కమిషన్‌ని కలుస్తుంటే అరెస్టులు చేస్తారా అని ఆయన విమర్శించారు. భవిష్యత్తులో గ్రామస్థాయి నుంచి ఢిల్లీ స్థాయి వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

